క్లుప్తంగా

పరిసరాల శుభ్రత తప్పనిసరి



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కార్మికులు

ఐరాల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్తగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కామినాయనపల్లె సర్పంచ్ బంగారమ్మ సూచించారు. కామినాయనపల్లె సచివాలయ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులతో శనివారం మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు ఇళ్ల సమీపంలో ఉన్న పిచ్చి మొక్కలు, పేడ దిబ్బలు, చెత్తచెదారం తొలగించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించారు. దోమల నివారణకు మలాథియాన్ మందు పిచికారీ చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గిరి పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం కట్టమంచి, సత్యనారాయణపురం, కుమ్మరవీధిలోని సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 5 గంటల నుంచి హారతి, విశేషపూజలు, భక్తులచే పాలాభిషేకం నిర్వహించనున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

యాదమరి(పూతలపట్టు): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చిన్నయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొననున్నట్లు తెలిపారు.

సీపీఎం చైతన్య రాజీనామా

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా స్థాయిలో ఏర్పడిన అంతర్గత కారణాలతో సీపీఎం, సీఐటీయూ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేశానని చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి రాజీనామాను వెల్లడించారు. రాజీనామా పత్రాన్ని ఆ జిల్లా ప్రధాన కార్యదర్శికి అందజేశానన్నారు. యాదమరిలో ఇండియన్ ఆయిల్, చిత్తూరు రూరల్ మండలంలోని బ్యాంకుల్లో పనిచేసే కార్మికుల తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈ విషయంలో నాయకత్వం పట్టించుకోలేదని.. అందుకే తాను రాజీనామాకు సిద్ధమైనట్లు ఆయన వివరించారు.

మామిడి దినోత్సవాన్ని విజయవంతం చేయండి

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న ప్రపంచ మామిడి దినోత్సవ సదస్సును విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మామిడి మార్కెట్ ఆవరణలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం అవుతుందన్నారు. పెద్ద సంఖ్యలో మామిడి రైతులు పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

మామిడి కోతపై అవగాహన



మాట్లాడుతున్న డీడీ మధుసూదన్‌రెడ్డి

పూతలపట్టు: మండలంలోని తిమ్మిరెడ్డిపల్లెలో శనివారం మామిడి రైతులకు కోత అనంతరం చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై జిలా ఉద్యానవనశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కాయలు కోసిన వెంటనే కొమ్మల కత్తిరింపులు చేపట్టాలని తెలిపారు. కొమ్మల కత్తిరింపుల ఆవశ్యకతను వివరించారు. రైతులు కొమ్మలు కత్తిరించిన వెంటనే ఎరువులు వేసి నీటి తడులను ఇవ్వాలని సూచించారు. పచ్చిరొట్ట పైరు ఇప్పుడు వేసి, సెప్టెంబర్, అక్టోబర్‌లో పూత వచ్చినప్పుడు దున్నుకోవడం వల్ల సూక్ష్మ పోషకాలు మామిడి చెట్లకు అంది, పూత బాగా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవనాధికారి వింధ్య, రైతులు పాల్గొన్నారు.

తెల్లగా మెత్తగా రుచిగా ఉండే ఇడ్లీ తయారీలో ప్లాస్టిక్ కవర్‌ను వినియోగిస్తున్నారన్న విషయం చాలా మందికి తెలియదు. బయటి హోటళ్లలో లభించే ఆహారంలో ఇడ్లీనే మంచిదని చాలా మంది అనుకుంటారు. దాన్నే ప్లాస్టిక్ కవర్లో పెట్టుకుని తింటుంటారు. కానీ ఆ ఇడ్లీని ప్లాస్టిక్ కవర్‌లో ఉడికించడంతో అది అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. దీంతో పాటు బోండాలు, బజ్జీలు, పూరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వినియోగించే నూనెలు విషంతో సమానం. అయితే ఈ విషయం చాలామందికి తెలిసినా రుచిగా ఉందని తినేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఇంటి ఆహారం కంటే బయట ఆహారాన్నే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. గతంలో అప్పుడప్పుడు సెలవు రోజుల్లో కుటుంబంతో సరదాగా బయటకు వెళ్లి తినేవారు కూడా ప్రస్తుత రోజుల్లో పొద్దున తినే అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు బయట హోటళ్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీనికి ప్రస్తుత జీవనశైలి ఒక కారణమైతే, వండుకునే ఓపిక, సమయం లేకపోవడం మరో కారణం. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారే తప్ప, ఆహారంలో నాణ్యతను పాటించడం లేదు.

వండేది.. తినేది కవర్లోనే!



ఇడ్లీ తయారీలో వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లు

- మరోవైపు కల్తీ నూనెలతో బోండాలు బజ్జీలు
- నిబంధనలు పాటించని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు
- నాణ్యత లేకుండా ఆహార పదార్థాల తయారీ
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

పూతలపట్టు: నోరూరించే రుచులను ఆస్వాదించేందుకు ఆహార ప్రియులు ఎంత ఖర్చయినా భరిస్తున్నారు. ఇంట్లో వంటింటి రుచుల కన్నా, మార్కెట్లో ఫాస్ట్‌ఫుడ్‌కే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. హోటళ్లలో తర్వగా రెడీమేడ్‌గా లభించే ఆహార పదార్థాలకు అలవాటు పడిన ప్రజలు వాటి నాణ్యతను గుర్తించడం లేదు. సమోసా, గారెలు, బజ్జీలు, వడలు వీటితో పాటు వేడిగా లభించే చికెన్, వెజ్ మంచూరియా, చేపల ఫ్రై, చికెన్ కబాబ్, చికెన్ పకోడి, ప్రాన్స్ ఫ్రైలను తినేందుకు ఎగబడుతున్నారు. ఆదాయమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న కొందరు వ్యాపారులు వంటకాల్లో నాణ్యతను విస్మరిస్తున్నారు. రోజుల తరబడి కడాయిలో వంట నూనెను మార్చకుండా వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మామూళ్లకు అలవాటు పడిన సంబంధిత అధికారులు వంటకాల్లో నాణ్యతను పాటించని వారిపై చర్యలు తీసుకోవడంలో పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి పూతలపట్టు, యాదమరి మండల కేంద్రంలో, రద్దీగా ఉండే పలు ప్రధాన సెంటర్లలో తోపుడు బండ్లలో ఆహార పదార్థాలు తయారు చేసే వ్యాపారం అధికంగా ఉంటుంది. చిరుతిండ్లకు అలవాటు పడిన ప్రజలు వాటిని తినేందుకు ఇష్టపడుతున్నారు. కానీ ఆహార పదార్థాలు, వాటి నాణ్యత ఎలా ఉన్నప్పటికీ తయారీకి వినియోగించే నూనె ఒకటికి నాలుగు సార్లు కాచిన నూనెను వాడటంతో అది విషంగా మారుతుంది. ఇటీవల కాలంలో దీని వినియోగం అన్ని చోట్లా విచ్చలవిడిగా పెరిగింది. తాజా నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలకు ఇలా చేసిన వాటికి తేడా ఉన్నప్పటికీ ఆహార ప్రియులు దీన్ని గుర్తించక ఆరగిస్తున్నారు. హోటళ్లలో ఉపయోగించే నూనెను ఒకటి, రెండు సార్లు మరిగించుకోవచ్చు. అంతకంటే ఎక్కువ సార్లు మరిగిస్తే అందులో తయారుచేసే ఆహార పదార్థాలు హానికరంగా మారుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఇడ్లీ తయారీలో ప్లాస్టిక్ కవర్లు

మండల కేంద్రంలోని పలు హోటళ్ల యజమానులు ఉదయం ఇడ్లీ పాత్రలో ప్లాస్టిక్ కవర్లను ఉంచి అందులో ఇడ్లీ పిండిని పోసి సుమారు 20 నిమిషాల పాటు ఉడికిస్తున్నారు. ఇడ్లీ ఉడికిన అనంతరం ఆ ప్లాస్టిక్ కవర్లను బయట వేసి మరొక కొత్త కవరును ఉంచి మరొక సారి ఉడికిస్తున్నారు. తద్వారా ఇడ్లీ మెత్తగా ఉంటుందని, ఇడ్లీ పాత్ర గుడ్డను శుభ్రపరిచే పని తగ్గుతుందనే ఉద్దేశంతో యజమానులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. వాస్తవానికి 20 నిమిషాల పాటు ప్లాస్టిక్ కవర్లలో ఇడ్లీ ఉడికితే ఆ కవరులో ఉండే అవశేషాలు ఇడ్లీకి అంటుకుంటాయి. వాటిని తినే ప్రజలు రకరకాల రోగాల బారిన పడుతున్నారు. ఇడ్లీని చిన్నపిల్లలతోపాటు, వ్యాధిగ్రస్తు లు ఎక్కువగా తింటుంటారు. తద్వారా వారికి విరేచనాలు, వాంతులు వంటి త్వరగా సోకుతాయి.

పట్టించుకోని అధికారులు

ఒకటి, రెండు హోటళ్లు మినహా ఇతర వాటిల్లో శుభ్రత పాటించడం లేదు. మాంసాహార హోటళ్లలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉన్నా పట్టించుకునే వారి కరువయ్యారు. మిగిలిపోయిన మాంసాన్ని రిఫ్రిజిరేటర్‌లో ఉంచి, తర్వాత రోజు వినియోగిస్తున్నారు. తనిఖీలకు వచ్చిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ కనీసం దుకాణాలను తనిఖీ చేయడం లేదు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చేస్తున్న గోబి మంచూరియా, కాడాయిలో మరిగిన నూనె, ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లలో వడ్డించగా తింటున్న వినియోగదారుడు

జాగ్రత్త పాటించాలి



కల్తీ ఆహారం తీసుకోవడంతో ఆరోగ్య సమస్యలకు దోహదపడుతుంది. కాలేయ, గుండె సంబంధిత వ్యాధులు, హైపర్ టెన్షన్, కొవ్వు పెరగడం, స్థూలకాయం, క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉంది. కొన్ని హోటళ్లలో పదార్థాలు ఎక్కువ సార్లు ఫ్రై చేస్తుంటారు. వాటిని తినడం ఆరోగ్యానికి హానికరం. తగిన జాగ్రత్తలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– చెన్నూరు కుమార్ రాజా,
మెడికల్ ఆఫీసర్, పి.కొత్తకోట

ఇంటి ముంగిటకే వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి ముంగిటకే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని కట్టకిందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి మఠంలో గురు పౌర్ణమి వేడుకలు



భక్తులకు దర్శనమిస్తున్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో శనివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి కాగడా హారతి సమర్పించారు ఆలయంలో వెలసిన విగ్రహాల దేవతామూర్తులు అందరికీ అభిషేక కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 6 గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి వారి అష్టోత్తర శతనామావళి పూజా కార్యక్రమం నిర్వహించి కలశపూజ, చంద్రపూజ నిర్వహించారు. ఉత్సవమూర్తులైన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి మహారాణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గుడిపాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రమహేష్ అన్నారు. నరహరిపేట జెడ్పీ హైస్కూల్లో శనివారం విద్యార్థులకు హెల్త్‌చెకప్‌తో పాటు సీజనల్ వ్యాధుల గురించి తెలియజేశారు. ముఖ్యంగా డెంగీ ఫీవర్ ప్రస్తుతం ఎక్కువగా వ్యాపిస్తోందని చెప్పారు. దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. జ్వరం బారిన పడిన వారికి చికిత్సలు చేసి మందులు, మాత్రలను అందజేశారు. అనంతరం మధ్యాహ్న భోజనంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మధ్యాహ్న కార్మికలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జబసెల్వి, ఉమామహేశ్వరి, సుజిమ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చంద్రుని దినోత్సవం

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ చంద్రుని దినోత్సవాన్ని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఇందులో కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు మాట్లాడుతూ చంద్రునిపై మనిషి పాదం మోపిన రోజును చంద్రుని దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. చంద్రునిపై మనం చేసే ప్రయోగాలు భవిష్యత్తులో మానవాళికి ఉపయుక్తంగా ఉంటాయని ఆయన తెలిపారు. ఇందులో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ చంద్రమోహన్

గుడిపాల: ప్రతి ఒక్క రోగికి మెరుగైన వైద్యసేవలు అందజేయనున్నట్లు ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ అన్నారు. పెద్దిశెట్టిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహిస్తుండగా ఆయన రోగులతో మాట్లాడారు. వైద్య సిబ్బంది రోగులకు కావలసిన మందులు, మాత్రలు ఇస్తున్నారా లేక బయట తీసుకోమంటున్నారా అని వారిని అడిగి తెలుసుకున్నారు.బీపీ, షుగర్, గర్భిణులకు చికిత్సలు నిర్వహించారు. ఇంటికే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వైద్యం అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తేజ, చంద్ర, ఇందుమతి, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

సంకటంగా వ్యవ'సాయం'పై స్పందన

సాక్షి ఎఫెక్ట్..

ఐరాల: మండలంలో ఖరీఫ్ స్థితిగతులపై శనివారం 'సాక్షి'లో సంకటంగా వ్యవ'సాయం' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యవసాయాధికారి స్పందించారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా గత ప్రభుత్వం 2022–23 సంవత్సరానికి 7,578 మంది రైతులకు, 2023–24 సంవత్సరానికి 7,869 మంది రైతులకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి అర్హులైన రైతులకు పెట్టుబడి సాయంపైన ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పెట్టుబడి సాయం అందజేస్తామని వెల్లడించారు.